ఏకరూప దుస్తుల అందజేత

విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న డీఆర్డీవో

ఇందల్వాయి, జూన్ 7 : డిచ్‌పల్లి మండలం కమలాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు డీఆర్డీవో సాయాగౌడ్ శుక్రవారం ఏకరూప దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులకు సకాలంలో యూనిఫామ్ అందించినట్లు తెలిపారు. డీపీఎం నీలిమా, ఏపీఎం రజిత, సీసీలు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల తనిఖీ

ఇందల్వాయి, జూన్ 7 : మండలంలోని ప్రథమ చికిత్స కేంద్రాలను మండల ఆరోగ్య విస్తీర్ణాధికారి వై.శంకర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆర్ ఎంపీ, పీఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని ఆదేశించారు. ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని సూచించారు. వారికి అనుబంధంగా ఉన్న మెడికల్ షాపులు, డయాగ్నోస్టిక్ సెంటర్లు తప్పకుండా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. తిర్మన్‌పల్లి గ్రామంలోని ఫిజియోథెరపీ సెంటర్‌ను తనిఖీ చేసి క్లినిక్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను తీసుకున్నారు.

గాంధీనగర్‌లో వాహనాలు..

నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తున్న పోలీసులు

ఇందల్వాయి, జూన్ 7: జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాంధీనగర్‌లో ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక వాహనాల తనిఖీ చేపట్టారు. నంబర్ ప్లేట్ లేని, మైనర్ డ్రైవింగ్ వాహనాల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 10 వాహనాలను సీజ్ చేసి జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు.

గూడ్స్‌రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

వినాయక్‌నగర్, జూన్ 7: నిజామాబాద్ జిల్లా రైల్వేస్టేషన్ పరిధిలో ఓ యువకుడు గూడ్స్ ట్రైయిన్ కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుందని రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. మోర్తాడ్ మండలానికి చెందిన పల్దా సంతోష్ (20) శుక్రవారం ఉదయం 6గంటల ప్రాంతంలో మండల పరిధిలోని రైలు పట్టాలపైకి వచ్చి, ఎదురుగా వచ్చిన గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. సదరు యువకుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని, మృతుడి అన్న ఫిర్యాదు తో కేసు నమోదు చేసి,పంచనామా నిర్వహించినట్లు తెలిపారు. మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై వెల్లడించారు.

రాష్ట్ర చిహ్నం మార్పుపై వినతి

మోర్తాడ్, జూన్7: తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర చిహ్నాన్ని మారుస్తూ కొత్త చిహ్నాన్ని తీసుకొస్తున్న సందర్భంగా ధర్మసమాజ్ పార్టీ తరపున నాయకులు చిహ్నాన్ని ప్రతిపాదిస్తూ శుక్రవారం కమ్మర్‌పల్లి తహసీల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఉస్మానియా యూనివర్శిటీ, అంబేద్కర్, పండగ సాయన్న, సర్దార్ సర్వాయి పాపన్న, సమ్మక్క సారలక్క చిత్రాలను రాష్ట్ర చిహ్నంలో ప్రతిపాదించామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కైలాస్, మోహన్, శంకర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

తోపుడు బండ్లు అందజేత

తోపుడు బండ్లు అందజేస్తున్న రోటరీక్లబ్ బాధ్యులు

ఆర్మూర్‌టౌన్, జూన్7: రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు గోపికృష్ణ, సభ్యులు చిరు వ్యాపారులకు తోపుడు బండ్లను శుక్రవారం వితరణ చేశారు. రోటరీ పీడీజీ.హన్మంత్‌రెడ్డి తండ్రి నల్ల వెంకట్ రెడ్డి స్మారకార్థం తోపుడు బండ్లను చిరు వ్యాపారులకు అందజేశామని అధ్యక్షుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు పట్వారి తులసి, లక్ష్మీ నారాయణ, క్రాంతి గంగారెడ్డి, విజయ సారథి, చరణ్ రెడ్డి పాల్గొన్నారు.

దొంగతనానికి వచ్చాడని దేహశుద్ధి

నవీపేట, జూన్ 7:ఓ ఇంట్లో చోరీ చేసి పారిపోతున్న దొంగను పట్టుకొని దేహశుద్ధి చేసిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితుడు డ్రైవర్ మల్లేశ్, స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలో తాపీ మేస్త్రీ శ్రీనివాస్ వద్ద కూలీలుగా చేస్తున్న ఇద్దరు వ్యక్తులు గురువారం రాత్రి డ్రైవర్ మల్లేశ్ ఇంటికి పడుకునేందుకు వెళ్లారు. కుటుంబీకులు నిద్ర పోతున్న సమయంలో పవన్ అనే వ్యక్తితోపాటు మరో కూలీ డ్రైవర్ మల్లేశ్‌లో ఇంట్లో ఉన్న రూ.7500 నగదును దొంగలించి పారిపోతున్నారు. పవన్ అనే దొంగను స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. మరో దొంగ పారిపోయినట్లు బాధితుడు మల్లేశ్ పేర్కొన్నారు. తమకు ఫిర్యాదు అందలేదని ఎస్సై యాదగిరిగౌడ్ పేర్కొన్నారు.

తాగునీరు కలుషితం కాకుండా చూడాలి

- లీకేజీలను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలి
- మున్సిపల్ అధికారుల సమావేశంలో నగర మేయర్ నీతూకిరణ్



సమావేశంలో మాట్లాడుతున్న నగర మేయర్ నీతూకిరణ్

ఖలీల్‌వాడి, జూన్ 7 : వర్షా కాలంలో తాగునీరు కలుషితం కాకుండా లీకేజీలను అరికట్టి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని నగర మేయర్ నీతూకిరణ్ ఆదేశించారు. శుక్రవారం ఆమె మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ సానిటేషన్ అధికారులు, సిబ్బందితో కమిషనర్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తు నాలాల పూడికతీత పనులు వేగవంతం చేయాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరకుండా నీటిని మళ్లించడానికి తాత్కాలిక నాలాలు ఏర్పాటు చేయాలన్నారు. నగర శివారు ప్రాంతాల్లో వీధి దీపాల (ఎల్ఈడీ) ఏర్పాటు పనులను వేగవంతం చేయాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో 24 గంటలూ వీధి దీపాలు వెలుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, నిర్వహణ సక్రమంగా చేయాలని సూచించారు. ఎన్నికలకు ముందు ప్రారంభించిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. హరితహారం కార్యక్రమానికి మొక్కలను సిద్ధం చేయాలని సూచించారు. కుళాయి అక్రమ కనెక్షన్ల సర్వే పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలను గుర్తించి ప్రమాదం జరగకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. చెత్త సేకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. వర్షాకాలంలో విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నివాస యోగ్య అనుమతులు పొంది వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న భవనాలను గుర్తించి మున్సిపాలిటీ పన్ను ఎగవేతదారులను గుర్తించాలని ఆదేశించారు. ఇంటి పన్ను వసూళ్లలో జాప్యంపై అధికారులతో చర్చించారు. నగరంలో చాలా ప్రాంతాల్లో అనుమతి లేకుండా తాత్కాలిక నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు నిర్వహిస్తున్నారని వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ శంకర్, ఆఫీస్ మేనేజర్ రెవెన్యూ అధికారి నరేందర్, టౌన్ ప్లానింగ్ అధికారులు సత్యనారాయణ, డిప్యూటీ ఇంజినీర్లు ఆనంద్ సాగర్, ముస్తాక్ అహ్మద్, టౌన్ ప్లానింగ్ అధికారులు ఇంజనీర్లు ఎంహెచ్ఓ సాజిద్‌అలీ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ప్రతి జిమ్‌లో సీసీ కెమెరాలు ఉండాలి

సీఐ ఆధ్వర్యంలో జిమ్ నిర్వాహకులకు కౌన్సిలింగ్

వినాయక నగర్, జూన్ 7: నగరంలోని ప్రతి జిమ్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నగర సీఐ నరహరి సూచించారు. జిమ్‌లకు వచ్చే వారిలో పలువురు యువకులు గ్యాంగులు ఏర్పాటు చేసుకుంటూ ఘర్షణలకు కారకులవుతున్నారనే విషయం సీపీ కల్మేశ్వర్ సింగేనవార్ దృష్టికి వచ్చిందని, ఆయన ఆదేశాల మేరకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు పేర్కొన్నారు. నిజామాబాద్ డివిజన్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని అన్ని జిమ్‌లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. శుక్రవారం ఆయన నిజామాబాద్ సర్కిల్ పరిధిలోని జిమ్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించి వారికి కౌన్సిలింగ్ చేశారు. జిమ్‌లకు వచ్చే వారిలో కొంత మంది యువకులు కత్తులు పట్టుకొని తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. గ్యాంగులు నడుపుతూ గ్యాంగ్ వార్‌లకు సైతం కారణమైన చాలా ఘటనలు ఉన్నాయని గుర్తుచేశారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని జిమ్ నిర్వాహకులు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు.జిమ్‌కు వచ్చే వారిలో ఎవరైన గంజాయి లేదా ఇతర మత్తుపదార్థాలు సేవిస్తే వెంటనే సంబంధిత పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు గుర్తిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో రెండు, మూడు, నాల్గో టౌన్ ఎస్సైలు రాము, ప్రవీణ్ కుమార్, సంజీవ్ ,సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నగర సీఐ నరహరి

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

జిల్లా ఆరోగ్య వైద్యాధికారి తుకారాం రాథోడ్

కోటగిరి సర్కారు దవాఖానలో రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ తుకారాం రాథోడ్

కోటగిరి/ రుద్రూర్/పోతంగల్, జూన్ 7: సర్కారు దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ అన్నారు.ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శుక్రవారం ఆయన కోటగిరి కమ్యూనిటీ హెల్త్ సెంటర్, రుద్రూర్, పోతంగల్ పీహెచ్‌సీలను ఆకస్మిక తనిఖీ చేశారు. రిజిస్టర్, మందుల స్టాక్ వివరాలను పరిశీలించారు. నిల్వ ఉన్న మందులను పరిశీలించారు. గడువు ముగిసిన మందులను ఉంచవద్దని వైద్య సిబ్బందికి సూచించారు. కుక్క, పాము కాటు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. దవాఖానలో ప్రసవాల సంఖ్య మరింత పెంచాలని సూచించారు. అనంతరం ఎత్తొండ ఆరోగ్య ఉప కేంద్రాన్ని తనిఖీ చేశారు.

నిబంధనలు పాటించని దవాఖానలపై చర్యలు

శక్కర్‌నగర్, జూన్ 7: నిబంధనలు పాటించని దవాఖానలపై చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి తుకారాం రాథోడ్ హెచ్చరించారు. శుక్రవారం బోధన్‌లోని పలు ప్రైవేటు దవాఖానలను ఆయన పలువురు వైద్యులు, సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. పలు దవాఖానల్లో లోపాలు గుర్తించారు. వాటిని సరిచేసుకోవాలని, లేని పక్షంలో దవాఖానలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. కొన్ని దవాఖానల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆదర్శ పాఠశాలకు విద్యార్థుల ఎంపిక

ధర్పల్లి, జూన్ 7: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి (2024-25) ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షలో ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ రాజేందర్ సాహెబ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాను పాఠశాలలో నోటీసు బోర్డుపై ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు ఓరిజినల్ సర్టిఫికెట్లు, ఒక జత జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్‌ఫొటోలతో ఈనెల 10 నుంచి పాఠశాలలో సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు 5వ తరగతి టీసీ, ప్రొగ్రెస్ కార్డు, 1 నుంచి 5వ తరగతి వరకు బోనాఫైడ్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్, కుల, ఆదాయ ధ్రువపత్రాలను తీసుకురావాలని తెలిపారు.

ఉపాధి హామీ కూలీల పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలి

కూలీలతో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాస్

ఇందల్వాయి, జూన్ 7 : జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండ గ్రామంలో ఉపాధిహామీ పనులు కొనసాగుతున్న ప్రాంతాన్ని మండల విద్యాధికారి శ్రీనివాస్ శుక్రవారం సందర్శించారు. కూలీలకు చదువుపై అవగాహన కల్పిస్తూ వారి పిల్లలను పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు, నాణ్యమైన విద్య గురించి వివరించారు. సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా అందుబాటులో ఉన్న స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జంగం అశోక్, వీడీసీ సభ్యులు లింగారెడ్డి, మహిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కోటగిరి, జూన్ 7: మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాలలో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటని, జంతుశాస్త్రం బోధించడానికి ఔట్ సోర్సింగ్ ప్రతిపాదికన దరఖాస్తులను ఆహ్వానిస్తునట్లు ప్రిన్సిపాల్ మహ్మద్ మొబీన్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 10వ తేదీన ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జూనియర్ కళాశాలలో దరఖాస్తులను అందజేయాలని కోరారు.

నేడు కోటగిరి, ఎత్తొండలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోటగిరి, జూన్ 7: కోటగిరి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న కోటగిరి, ఎత్తొండ గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కోటగిరి ట్రాన్స్‌కో ఏఈ నాయిని కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని పాత సెంటర్‌కు మార్చాలి

సిరికొండ, జూన్ 7: మండలంలోని తాళ్లరామడ్గులోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని గ్రామశివారులోకి మార్చారని, దానిని పాత కేంద్రంలోని కొనసాగించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు వారు ఐసీడీఎస్ అధికారి ప్రసాద్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రానికి గర్భిణులు, పిల్లలు వెళ్లాలంటే 2.5 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుందని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. పాత కేంద్రంలోనే కొనసాగించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో రంజిత్, సతీష్, దిలీప్, సురేశ్, నవీన్ పాల్గొన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి

అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి

ఏర్గట్ల, జూన్ 7: మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి అధ్యక్షతన మండల చివరి సర్వ సభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీతో పాటు జడ్పీటీసీ సభ్యుడు గుల్లే రాజేశ్వర్ ఆయా శాఖల అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. ఆయా శాఖల ఏఈలు, అధికారులు మాట్లాడుతూ.. ప్రజలకు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. తహసీల్దార్ యూసుఫ్ మాట్లాడుతూ.. రైతుల భూ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఎంపీటీసీలు జక్కని మధుసూదన్, అడెం సవిత, మండల కోఆప్షన్ మెంబర్ అస్రాఫ్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంఈవో ఆంధ్రయ్య, ఇన్‌చార్జి మండల వ్యవసాధికారిణి, ఆయా శాఖల ఏఈలు విక్రమ్, వినీత్, స్వరాజ్, ఏర్గట్ల పీహెచ్‌సీ ఇన్‌చార్జి డాక్టర్ లింబారెడ్డి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగలక్ష్మి, ఎంపీవో శివచరణ్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా చేపల విక్రయం

ముప్కాల్‌లో చేపలు కొనుగోలు చేస్తున్న గ్రామస్తులు

బాల్కొండ/ ముప్కాల్/ పొతంగల్, జూన్ 7: బాల్కొండ మండల కేంద్రంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం మృగశిర కార్తె (మిరుగు)ను పురస్కరించుకుని ప్రజలు పెద్ద ఎత్తున మార్కెట్లలో చేపలు కొనుగోలు చేశారు. మండల కేంద్రంలోని మార్కెట్లో చేపలు కొనేందుకు ప్రజలు తరలివచ్చారు. ముప్కాల్ చేపల మార్కెట్ వద్ద తెల్లవారుజాము నుంచి కొనుగోలుదారులు చేపల కోసం క్యూ కట్టారు. కిలో చేపలు రూ.120కు విక్రయించారు. కిలో చికెన్ ధర మార్కెట్‌లో రూ.260, కిలో మటన్ రూ.600కు పైగా ఉండడంతో సాధారణ రోజుల్లోనూ ప్రజలు చేపలు తినేందుకు మక్కువ చూపుతున్నారు. పొతంగల్ మండలంలోనూ చేపలు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు.

మొరం అక్రమ రవాణాను అరికట్టాలి

మండల సభలో సభ్యుల డిమాండ్

మాట్లాడుతున్న ఎంపీపీ సంగెం శ్రీనివాస్

నవీపేట, జూన్ 7: మండలంలో వివిధ గ్రామాల్లో రాత్రి వేళలో నిబంధనలకు వ్యతిరేకంగా కొనసాగుతున్న మొరం అక్రమ రవాణాను అరికట్టాలని సభ్యులు రెవెన్యూ అధికారులను డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంపీపీ సంగెం శ్రీనివాస్ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. జడ్పీటీసీ నీరడి సవిత, ఎంపీడీవో నాగనాథ్, తహసీల్దార్ నారాయణ, వైస్ ఎంపీపీ హరీశ్ హాజరయ్యారు. నవీపేటలో మొరం మాఫియా రెచ్చి పోతోందని అన్నారు. రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఎంపీపీ , వైస్ ఎంపీపీ సభ దృష్టికి తీసుకువచ్చారు. తహసీల్దార్ నారాయణ మాట్లాడుతూ మొరం దాందాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. మండల కేంద్రంలో విద్యార్థులకు క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ నందిపేట మీనా కోరారు. పాఠశాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు, నీటి సౌకర్యం కల్పించాలని ఎంఈవో గణేశ్‌రావుకు సూచించారు. నవీపేటలో ఇండ్లపై నుంచి ఉన్న 11 కేవీ లైన్ తొలగించాలని కోరారు.నవీపేటకు మంజూరైన బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను నిజామాబాద్‌లో కొనసాగడం సరికాదని, వెంటనే మండల కేంద్రానికి మార్చాలని మోకన్‌పల్లి ఎంపీటీసీ బేగరి జనార్దన్ డిమాండ్ చేశారు. నవీపేటలో ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ డాంకే సతీశ్ కోరారు. ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా విద్యాశాఖ అధికారులు కృషి చేయాలని ఎంపీపీ కోరారు. నవీపేట మండలంలో 39 అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతు పనులకు రూ.2.54 కోట్లు మంజూరైనట్లు పీఆర్ ఏఈ శ్రావణ్‌కుమార్ ప్రకటించారు. చివరి సమావేశానికి ఈఏవోను పంపించి ఏవో సురేశ్ గైర్హాజరు కావడంతో ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ డీలర్లు సమయపాలన పాటించడం లేదని, అక్రమాలకు పాల్పడుతున్నారని ఎంపీపీ తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. మీ సేవ కేంద్రంలో స్లాట్ బుక్ చేసినా తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఎస్ సమస్య ఉందంటూ పట్టా చేయక పోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని సభ్యులు న్యాలకంటి సాయిలు, కృష్ణమోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మన ఊరు మన బడి పథకంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు నిధుల మంజూరు కాక వారు ఇబ్బంది పడుతున్నారని నిజాంపూర్ ఎంపీటీసీ కృష్ణమోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు తనిఖీ

పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, ఏఈ సూర్య శ్రీనివాస్

శక్కర్‌నగర్, జూన్ 7: అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో ఎంపికైన బోధన్ పట్టణంలోని పలు పాఠశాలల్లో పనులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, ఏఈలతో కలిసి పరిశీలించారు. ప్రధానోపాధ్యాయురాలితో మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈలు సూర్య శ్రీనివాస్, శివకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

పల్లె ప్రగతి పనుల పరిశీలన

బోధన్ రూరల్, జూన్7: బోధన్ మండలంలోని లంగ్డాపూర్, పెగడపల్లి తదితర గ్రామాల్లోని పల్లె ప్రగతి పనులను ఎంపీవో మధకర్ శుక్రవారం పరిశీలించారు. నర్సరీలో మొక్కలను పరిశీలించారు. ఆయన వెంట ఆయా గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

శక్కర్‌నగర్, జూన్ 6: బోధన్ పట్టణం శివారులోని బెల్లాల్ చెరువు కట్టపక్కనే ఉన్న పాపనాగమ్మ ఆలయం వద్ద శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆ ప్రాంతానికి వెళ్లిన కొందరు గుర్తించారు. బోధన్ పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోలీసులు పట్టణంలోని జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతిచెందిన వృద్ధుడి వయసు సుమారు 70 ఏండ్లు ఉంటుందని, ఒంటిపై షర్టు లేదని, ఆనవాల్లు లభ్యం కాలేదని పేర్కొన్నారు. వివరాలు తెలిస్తే బోధన్ పోలీసులకు సమాచారం అందించాలని పట్టణ సీఐ వీరయ్య కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు

మోర్తాడ్/ఏర్గట్ల/ఆర్మూర్‌టౌన్/బోధన్ రూరల్/ రెంజల్, జూన్ 7: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో ఆంధ్రయ్య కోరారు. శుక్రవారం కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాల్లో జరిగిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఏర్గట్ల మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఆర్మూర్ మండలంలోని మంథని గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బోధన్ మండలంలోని ఆయా గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. రెంజల్ మండలంలో రెండో రోజు బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. దూపల్లి గ్రామంలో ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

'విజయవంతం చేయాలి'

భీమ్‌గల్, జూన్7: భీమ్‌గల్ మండల స్థాయి సమావేశాన్ని ఎంపీడీవో సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను కోరారు. ఐదేండ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, బడిమానేసిన పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. సమావేశంలో ఎంఈవో స్వామి, ఎస్సై హరిబాబు, ఏపీఎం రవీందర్, కాంప్లెక్స్ హెచ్ఎంలు శ్రీనివాస్, అనురాధ, సీఆర్‌పీలు బాలరాజు, సంతోష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమాదేవి, శారద, హాస్టల్ వార్డెన్ లక్ష్మణ్, రవీందర్, నవనీత, ఐకేపీ సీసీలు, ఎన్‌జీవోలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలోనే చేరండి

ఆర్మూర్‌టౌన్, జూన్7: పదో తరగతి పాసైన విద్యార్థులు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని కోరుతూ అధ్యాపకులు శుక్రవారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇర్ఫానా, అధ్యాపకులు స్వాతి, రాజకళా, వెంకటేశ్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి

మాక్లూర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

బాల్కొండలో స్టాకును పరిశీలిస్తున్న ఏవో

బాల్కొండ/మాక్లూర్, జూన్ 7: బాల్కొండ మండలంలోని ఎరువులు, విత్తన దుకాణాలను మండల వ్యవసాయాధికారి మహేందర్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. రైతులకు కావాల్సిన ఎరువులను అంద